## క్లుప్తంగా

### బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు

దెందులూరు: అన్ని ప్రభుత్వ బ్యాంకుల్లో కంటే చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు 8.75 శాతం వడ్డీ ఇస్తోందని, ఈ సేవలను వినియోగదారులు పొందాలని దెందులూరు చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌నాగార్జున అన్నారు. శనివారం దెందులూరు బ్యాంకులో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు రూ.వెయ్యి బీమాకు చెల్లిస్తే వ్యక్తిగత ప్రమాద బీమా పథకంలో రూ. 20 లక్షలు అందిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు గ్రామాల్లో చైతన్య మిత్రాలు, బ్యాంకులో మేనేజర్‌ను సంప్రదించాలన్నారు.

### ఆడుదాం ఆంధ్ర విజయవంతం కావాలి

దెందులూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతం కావాలని స్పోర్ట్స్ అథారిటీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం గోపన్నపాలెం సచివాలయంలో ఆడుదాం ఆంధ్ర ట్రయల్ టోర్నమెంట్‌ను మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్ ఆధ్వర్యంలో టీం-1, టీం-2 గేమ్స్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోపన్నపాలెం వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ నత్తానియేలు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో స్పోర్ట్స్ ఎలా నిర్వహించాలి, ఎలా నమోదు చేసుకోవాలనే అనే విషయంపై అవగాహన కల్పించారు. టెక్నికల్ అసిస్టెంట్ సౌజన్య, పీడీలు రవిబాబు, రాధ, రాజేష్, పార్థసారధి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ రాజేష్ ఉన్నారు.

### తుపాను బాధిత రైతులకు అండగా ప్రభుత్వం

భీమడోలు: మిచాంగ్ తుపాను ప్రభావంతో వరి పంట దెబ్బతిన్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని భీమడోలు మండల వ్యవసాయాధికారిణి డాక్టర్ ఎస్‌పీవీ ఉషారాణి అన్నారు. మండలంలో ఇప్పటి వరకు పంట నష్టం వివరాలను సోషల్ ఆడిట్‌లో భాగంగా రైతు భరోసా కేంద్రాల్లో శనివారం వ్యవసాయశాఖ సిబ్బంది నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటను సర్వే చేసామని, మండలంలోని 90శాతం గ్రామాల్లో నష్ట అంచనాలపై సర్వే పూర్తి చేసామని ఏవో పేర్కొన్నారు. మండల పరిధిలో 312 మంది రైతులకు చెందిన 520 ఏకరాల సార్వా పంట దెబ్బతిన్నట్లు ఉన్నతాధికారులకు అందించిన నివేదించారు. రైతుకు చెందిన దెబ్బతిన్న పంట విస్తీర్ణం తదితర వివరాలను ఆ బోర్డులో ఉంచారు. మండల వ్యాప్తంగా 13,150 ఎకరాల్లో దాళ్వా సాగు ప్రారంభించారని, వాటిలో ఇప్పటి వరకు నారుమడులు 7,474 ఎకరాల్లో వేశారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

### సాబ్జి మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు

భీమడోలు: ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సీ షేక్ సాబ్జి మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు అని భీమడోలు ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. భీమడోలు మండల విద్యావనరుల కేంద్రంలో శనివారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ సాబ్జి మృతికి సంతాప సభ నిర్వహించారు. సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు జి.బాలభాస్కర్, యు.ఉపేంద్ర, ఎం.శరీన్, మండే సుధాకర్, బాలిన సత్యనారాయణ, ఎం.శేఖర్, ఎస్‌కే ముంతాజ్‌బేగం, ఎస్‌వీఎల్ శర్మ, పి.మోహనరావు,పైడారావు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధిలో ఆదర్శవంతమైన పాలన

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- మూడవ రోజు ప్రజా ఆశీర్వాద యాత్ర
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



విజయరాయిలో పాదయాత్రలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : సంక్షేమం, అభివృద్ధిలో ఆదర్శవంతమైన పాలన అందించామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మూడవ రోజు శనివారం జానంపేట పంచాయతీ ప్రకాష్‌నగర్‌లో ప్రజా ఆశీర్వాద యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ముందుగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి సంతాపంగా వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి 2 నిమిషాల పాటు మౌనం పాటించి పాదయాత్ర ప్రారంభించారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరితో కలిసి పాదయాత్రలో పాల్గొన్న ప్రకాష్‌నగర్ ప్రజలు ఘనస్వాగతం పలికారు. ప్రకాష్ నగర్ ప్రభుత్వ పాఠశాలకు ఎమ్మెల్యే వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం గ్రామ దేవత దుర్గమ్మను దర్శించుకుని, పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇళ్లు కట్టుకుంటున్న పలువురి ఇళ్లకు భూమి పూజ చేశారు. ప్రజా ఆశీర్వాద యాత్రకు గుర్తుగా ప్రకాష్ నగర్‌లో ప్రజలతో కలిసి మొక్కలు నాటి విజయరాయికి తన పాదయాత్రను కొనసాగించారు. విజయరాయికి విచ్చేసిన ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగస్వాములై ముందుకు సాగారు. గ్రామ దేవత గంగానమ్మ తల్లి ఆలయంలో పూజలు చేసి అనంతరం పాదయాత్ర చేశారు. విజయరాయి ప్రభుత్వ పాఠశాలలో మన బడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు, గ్రామంలో దళితపేటలో, బీసీ ఏరియాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు, ప్రభుత్వ ఆసుపత్రి పనులకు, కృష్ణాజిల్లా, ఏలూరు జిల్లా చిరకాల వాంఛ బలివే వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నడిపల్లిలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, బాపిరాజుగూడెం బస ప్రాంతాన్ని యాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ బరియల్ గ్రౌండ్‌కి వెళ్లే రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడ ఎలక్ట్రిక్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఏడీని ఆదేశించారు. డ్రెయిన్ సమస్యను పరిష్కరిస్తానని, గ్రామంలో హాస్పిటల్ ప్రైమరీ సెంటర్ శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. బీసీ కాలనీలో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన, రూ.20 లక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. వైఎ స్సార్ సీపీ ప్రభుత్వాన్ని 2024లో భారీ మెజార్టీతో గెలిపించాలని అబ్బయ్యచౌదరి ప్రజలను కోరారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ ప్రజల అవసరాలు తీరుస్తున్నారని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# హామీలిచ్చి విస్మరించడం చంద్రబాబు నైజం




సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్

పెదపాడు: హామీలిచ్చి వాటిని చిత్తశుద్ధితో అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడం చంద్రబాబు నైజమని, ఆయన ఇచ్చే గ్యారెంటీలపై ప్రజలకు నమ్మకం లేదని ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని వసంతవాడలో సర్పంచ్ చింతల రమాభారతి అధ్యక్షతన నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమంతో పాటు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి పాల్గొని ప్రసంగించారు. వసంతవాడలో గతంలో ఎవరికైనా ఇళ్ల స్థలం ఇచ్చారా అని ప్రశ్నించడంతో అందరూ ఒక్కసారిగా గజం స్థలం కూడా ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సెంటున్నర స్థలం అందించినట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చడంతో పాటు హామీ ఇవ్వకుండానే అనేక పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వసంతవాడ ఎంపీటీసీ కలపాల ఆదిలక్ష్మి, నాయకులు చింతల ఆనంద్, తుమ్మల గోపాలకృష్ణ, ఆముదాల విజయరాజు, ఉపసర్పంచ్ ఫణీంద్రకుమార్, బత్తుల ఏసురాజు, మట్టా లక్ష్మణరావు పాల్గొన్నారు.

### హామీలన్నీ అమలు చేసిన సీఎం జగనన్న

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనితీరును ప్రజలు బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ఏవిధంగా అమలు చేశారో ప్రజలకు వివరించారు. పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బందారు నాగరాజు, వార్డ్ మెంబర్ లోక్ వినోద్ కుమార్, సచివాలయం కన్వీనర్ తాడిగడప వెంకటేశ్వర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

# మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రభుత్వం కృషి



భువనపల్లిలో డ్వాక్రా మహిళకు ఆటో, రుణం పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం(భీమడోలు): డ్వాక్రా సంఘాల మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం భువనపల్లిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మొయ్యేరుకు చెందిన షాలేమ్ డ్వాక్రా సంఘం సభ్యురాలు మంద్రు రాజాకుమారికి శనివారం ఎమ్మెల్యే వాసుబాబు చేతుల మీదుగారూ.3లక్షల విలువ చేసే ఆటో పాటు వడ్డీ లేని రుణం పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నింటినీ మహిళల పేరుతో అమలు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. గత నెలలో సెర్ప్ ఆధ్వర్యంలో ఆటో నడిపేందుకు ముందుకు వచ్చిన మహిళలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారన్నారు. రుణాన్ని సకాలంలో వాయిదాల్లో చెల్లించి ఆటోకు యాజమాని కావాలన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశలో చేస్తున్న ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు విజయవంతమవుతున్నాయన్నారు. సర్పంచ్ దుళ్ల కుటుంబరావు, నాయకులు, డ్వాక్రా సంఘాల సీసీలు పాల్గొన్నారు.

### ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం పెద్ద పీట

భీమడోలు: ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన రూ.10లక్షల నిధులతో శనివారం శ్రీపాండురంగస్వామి ఆలయ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శిథిలావస్థకు చేరిన దేవాలయాలను పునర్నిర్మించడం, ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలను నిరాటంకంగా నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీలు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకటకృష్ణారావు, నాయకులు పెద్దిరెడ్డి భోగయ్య, గనిశెట్టి పాండురంగారావు, భక్తులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి మూర్తిరాజు నేటి తరం నేతలకు ఆదర్శం

నిడమర్రు: మాజీ మంత్రి, గాంధేయ వాది చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు సేవలు నేటి తరం నాయకులకు ఆదర్శనీయమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం పెదనింద్రకొలను మహాత్మా గాంధీ భవనంలో మూర్తిరాజు 104వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 68 విద్యా సంస్థలు స్థాపించి వేలాది మందికి విద్యాదానం చేసిన విద్యాదాత, కొల్లేరు ప్రజలకు అన్ని విధాల అదుకున్న గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. మూర్తిరాజు కలల సౌధం గాంధీ భవనం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ముందుగా మూర్తిరాజు, సత్యవతి దేవి దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఈవో ఇందుకూరి ప్రసాదరాజు, సాగిరాజు జానకిరామరాజు, భీమరాజు తదితరులున్నారు.

### విద్యాదాత మూర్తిరాజు సేవలు చిరస్మరణీయం

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మూర్తి రాజు 105వ శత జయంతి నిర్వహించారు. పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి కే విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా జానకి రామరాజు, ఆదిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సిబ్బంది, విద్యార్థులతో కలిసి మూర్తి రాజు చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూర్తి రాజు సేవలను విద్యార్థులకు వివరించారు. మాజీ అధ్యాపకులు ఆదిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మూర్తి రాజు అనేక విద్యాలయాలను స్థాపించి పేద మధ్యతరగతి స్త్రీల విద్యకు ఎంతో ఉపయోగపడ్డారన్నారు. గాంధేయ వాదిగా, అహింసా వాదిగా, విద్యాదాతగా 1,800 ఎకరాలు భూమిని దానం చేశారని కొనియాడారు. అధ్యాపకుడు ఉమాశంకర్ మాట్లాడుతూ మూర్తిరాజు చిరస్మరణీయుడని అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు.

# గ్రామ సచివాలయ కార్యదర్శులకు శిక్షణ

భీమడోలు: గ్రామ పంచాయతీ కార్యకలాపాలపై సచివాలయ కార్యదర్శులు పట్టు సాధించేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో దోహద పడతాయని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన, ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై పంచాయతీ కార్యనిర్వాహక అధికారులు, సచివాలయ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఈవోఆర్‌డీ సుందరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి పాల్గొని వారికి పంచాయతీరాజ్ యాక్ట్‌లో భాగంగా గ్రామ పంచాయతీల కార్యకలాపాలు, ఉద్యోగుల విధులు, బాధ్యతలపై వారికి తగు సూచనలందించా. సచివాలయ కార్యదర్శులంతా పంచాయతీరాజ్ యాక్ట్ మేరకు విధులను నిర్వర్తించాలని అన్నారు. సూరప్పగూడెం గ్రామ కార్యదర్శి ముత్తయ్య సచివాలయ కార్యదర్శులకు శిక్షణ అందించారు. తొలుత ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి వారంతా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పంచాయతీ కార్యనిర్వాహక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ పోటీలకు దంత కళాశాల వైద్య విద్యార్థులు

పెదవేగి : సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీలకు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల వైద్య విద్యార్థులు ఎంపికైయ్యారని కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి మోజెస్ అన్నారు. శనివారం దంత కళాశాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ విజయవాడ డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టర్ త్రిమూర్తి సారథ్యంలో శనివారం సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో ఫుట్‌బాల్ సెలెక్షన్ నిర్వహించారని చెప్పారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ సెయింట్ జోసెఫ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నిట్టా నల్లయ్య ఆధ్వర్యం వహించారు. ఎంపికైన క్రీడాకారులు మద్రాసులో ఎస్ఎంఆర్ యూనివర్సిటీలో ఈ నెల 25 నుంచి నిర్వహించే సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ ఫుట్‌బాల్ కోచ్ సిరాజ్ వద్దీన్, జె సెల్వి బాబు, శ్రీనివాసరాజు, టి గురునాథ్ పాల్గొన్నారు.

### పెసలు పంపిణీ

దెందులూరు: దెందులూరు సొసైటీలో తుపాను బాధిత రైతులకు 80 శాతం సబ్సిడీపై పెసలను శనివారం పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ ఏఓ గద్దె రమేష్, దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు పాల్గొన్నారు.

# అనాథ ఆశ్రమానికి చేయూత

దెందులూరు: పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలు విక్రయించగా వచ్చిన నగదుతో పాఠశాల సిబ్బంది కొంత నగదు కలిపి అనాథాశ్రమానికి చేయూత అందిస్తున్నామని సెయింట్ మేరిస్ యూపీ పాఠశాల హెచ్ఎం సిస్టర్ టీనా, ప్రొవెన్షియల్ లీసా అన్నారు. శనివారం దెందులూరు సెయింట్ మేరిస్ యూపీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్త ఆధ్వర్యంలో 18 రకాల ఆహార పదార్థాలు, పానీయాలు తయారు చేశారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, గ్రామస్తులకు వాటిని విక్రయించారు. సిస్టర్ టీనా మాట్లాడుతూ ఏటా పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి అనాథాశ్రమాలకు తమ వంతు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. ఓకేషనల్ కౌన్సిలర్ సిస్టర్ శాంటా, సిస్టర్ జూలీట్, విన్నీ మరియా, స్మితా, పాఠశాల అధ్యాపకులున్నారు.

### గ్రామాల్లో వికసిత్ సంకల్పయాత్ర

పెదపాడు : పాతముప్పర్రు, జయపురంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అధికారులు నిర్వహించారు. ప్రధాన మంత్రి సందేశాన్ని దూరదర్శన్ ద్వారా ప్రజలకు వివరించారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అకాల మరణం కారణంగా జిల్లా కలెక్టరు ఆదేశాలతో రెండు రోజులు సంతాప దినాలుగా ప్రకటించడంతో అధికారులు సాదాసీదాగా నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పెదపాడు ఎంపీడీవో ఎస్ సూర్యకుమార్, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యుడు చక్రధర్, డాక్టరు అనంతపాల్, మండల వ్యవసాయ అధికారి వీ ప్రదీప్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారి డీవీ రమణ పాల్గొన్నారు.

### ప్రజా ఆశీర్వాద పాదయాత్రను విజయవంతం చేయండి

దెందులూరు: ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేస్తున్న ప్రజా ఆశీర్వాద పాదయాత్రను విజయంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు కోరారు. శనివారం ద్విచక్రవాహనంపై వైఎస్సార్ సీపీ జెండాలతో ఊరురా వెళ్లి ప్రజా ఆశీర్వాద పాదయాత్రపై ప్రచారం చేస్తున్నట్టు వారు తెలిపారు.

### ఎమ్మెల్సీ సాబ్జికి నివాళులు

ఉంగుటూరు: రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జి సంతాప సభ మండలంలోని నారాయణపురం హైస్కూల్లో ఉంగుటూరు యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వునుముల రాంబాబు, డాకి జోగినాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.

### ఓటింగ్ యంత్రాలపై అవగాహన

ఉంగుటూరు: ఓటు వేసే ప్రతి ఒక్కరూ ఓటింగ్ యంత్రాల పనితీరును తెలుసుకోవాలని డీటీ పోతురాజు తెలిపారు. కైకరంలో శనివారం ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రజలకు ఆయన వివరించారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లను ప్రజలకు చూపించి అవి పనిచేసే విధానాన్ని తెలియజేశారు.

### అంగన్‌వాడీల సమస్యలపై ధర్నా

దెందులూరు: అంగన్‌వాడీల న్యాయబద్ధమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు సుబ్బారావు అన్నారు. అంగన్‌వాడీలు నాలుగు రోజులుగా చేస్తున్న సమ్మెకు శనివారం ఆయన సంఘీభావాన్ని ప్రకటించారు. దెందులూరు 9వ వార్డు సెంటరులో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు దీక్షలు చేశారు.

**అంగన్‌వాడీల నిరసన**

పెదవేగి : రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా 5వ రోజు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నల్ల రిబ్బన్లు మూతికి కట్టుకొని నిరసన తెలియజేశారు. ముందుగా షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం బాధాకరమని సంతాపం తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా నాయకులు విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి వీ బేబీ రాణి టి కృష్ణవేణి సెక్టార్ లీడర్లు ఎం. త్రివేణి. ఏ భార్గవి పీవీఎల్ సూర్య కుమారి పాల్గొన్నారు.